క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం



రామచంద్రపురం: శీలంవారిసావరం రోడ్డులో ఉన్న సబ్ స్టేషన్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో డివిజనల్ ఈఈ కె.విజయానంద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శీలంవారిసావరం, వైఎస్సార్ నగర్, బీరు ఫ్యాక్టరీ, రైలు గట్టు, శాంతినగర్, రాజగోపాల్ సెంటర్, ద్రాక్షారామ రోడ్డు, వెల్ల వాటర్ వర్క్స్, పాత బస్టాండ్, కృత్తివెంటి క్రీడా ప్రాంగణం, బ్రాడీపేట, డీఎస్పీ కార్యాలయం రోడ్డు, రాజబాబునగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కాపవరం ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ శీలం ఏసురాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు జగన్నాయకులపాలెం, తాళ్లపొలం, వెల్ల, వెల్ల సావరం, ఆదివారపుపేట, ఏరుపల్లి, కాపవరం, తాడిపల్లి గ్రామాలకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర విద్యుత్ సబ్ స్టేషన్‌లోని కపిలేశ్వరపురం మండల హెడ్ క్వార్టర్ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ రామచంద్రపురం డివిజన్ డీఈ వై.విజయానంద్ గురువారం తెలిపారు. లైన్ మెయింటెన్స్ పనులు కారణంగా ఫీడర్ పరిధిలోని కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకూ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

జనాభా పెరుగుదలపై అవగాహన ఉండాలి

రామచంద్రపురం: పెరుగుతున్న జనాభాపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.సత్యలత అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్‌తో అధిక జనాభా వల్ల తలెత్తే పరిణామాలను వివరించారు. ఎకనామిక్స్ విభాగాధిపతి రవికుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా జక్కా

కాజులూరు: బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా కాజులూరుకు చెందిన జక్కా శ్రీనివాసరావు నియమితులయ్యారు. స్థానిక శ్రీరామ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంతో ఆయనను ఎంపిక చేశారు.

నవోదయకు ఏరుపల్లి విద్యార్థిని ఎంపిక



భువనలాస్య

రామచంద్రపురం రూరల్: ఏరుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని గోర్త భువనలాస్య నవోదయ విద్యాలయలో ఆరో తరగతి సీటు సాధించింది. ఈ మేరకు హెచ్ఎం వి.నాగేశ్వరరావు గురువారం విలేకరులకు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆమెను అభినందించారు.

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం

కె.గంగవరం: పౌష్టికాహారం తీసుకుంటే బాలింతలకు మెరుగైన ఆరోగ్యం ఉంటుందని రామచంద్రపురం ఐసీడీఎస్ సీడీపీఓ వీవీ వీరమహాలక్ష్మి అన్నారు. పాణింగపల్లిలో గురువారం బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉన్న శిశువు జన్మిస్తుందని చెప్పారు. సూపర్‌వైజర్ పి.చంద్రకళ, మహిళా పోలీస్ డి.పద్మావతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసంతో పాడి పశువులకు మేలు



పశుగ్రాస విత్తనాలు అందిస్తున్న ఏడీ రామకృష్ణ

కె.గంగవరం: సరైన పశుగ్రాసాన్ని పశువులకు అందిస్తే ఆరోగ్యకరంగా ఉంటాయని పశు సంవర్థక శాఖ రామచంద్రపురం ఏడీ రామకృష్ణ అన్నారు. భట్లపాలిక పంచాయతీ వద్ద గురువారం పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా అవగాహన సమావేశం నిర్వహించారు. పశుగ్రాసం ప్రాముఖ్యతపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పాడి రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు అందించారు. కార్యక్రమంలో పశు వైద్యులు సంయుక్త లక్ష్మి, రామచంద్రరావు, సురేష్, బిందు, భావన జ్యోతి, విజయదుర్గ, మాజీ ఎంపీటీసీ రవ్వా భూషణం తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చి.. ప్రజలను ఏమార్చి

- తల్లికి వందనం పథకంపై మాట మార్చిన ప్రభుత్వం
- ఒక్కో తల్లికి రూ.15 వేలు ఇస్తామనడంపై అసహనం
- చెప్పినట్టు సాయమందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిది
- మండపేట నియోజకవర్గంలో 21,441 మంది తల్లులకు సాయం
- నాలుగో విడతలో రూ.27,87,33,000 లబ్ధి
- గత ప్రభుత్వంలో రామచంద్రపురం నియోజకవర్గంలో 8,544 మంది తల్లులకు సాయం
- నాలుగో విడతలో రూ.11,10,72,000 మేర లబ్ధి



మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ పరికరంలో పాఠం వింటున్న విద్యార్థులు (ఫైల్)

కపిలేశ్వరపురం: అధికారంలోకి వచ్చాక తల్లికి వందనం పథకం అమలు చేస్తాం.. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేల ఆర్థిక సాయమందిస్తాం.. ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంత మందికి జమ చేస్తాం.. మనసు్స ఉంటే మార్గం ఉంటుంది. డబ్బులు లేకపోతే సంపదను సృష్టించి ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తాం.. ఇవీ సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు చెప్పిన మాటలు. తీరా పదవిలోకి వచ్చేసరికి మాట మార్చారు. పాలనా కాలం నెల రోజులు పూర్తికావచ్చినా సొమ్ములు అందించలేదు. అధికారంలోకి రావడం కోసం నోటికి వచ్చిన హామీలన్నీ ఆకర్షణీయంగా గుప్పించిన ఆయన ఎన్నికల తర్వాత వాటిని పక్కకు నెట్టే మాటలు మాట్లాడుతున్నారు. తల్లికి వందనం పేరుతో అందించాల్సిన సాయాన్ని ఒక్కో తల్లికి రూ.15వేలకు పరిమితం చేసేలా ఆయన మాటలు ఉండడంతో తల్లుల్లో ఆందోళన మొదలైంది.

పిల్లల సంఖ్య మటుమాయం

ఈ నెల పదో తేదీన తల్లికి వందనం పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ప్రకటించారు. ఎన్నికలు ముందు చెప్పినట్టు ఇంటిలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15వేలు చొప్పున ఆర్థిక సాయమందిస్తాను అన్న మాట ఎక్కడా కనిపించలేదు. తల్లికి రూ.15వేలు చొప్పున సాయమందిస్తామన్న మాట అన్నారు. దీనిపై తల్లుల్లో ఆందోళన ఆరంభమైంది. ఇద్దరో, ముగ్గురో పిల్లలున్న తల్లులు తమ పిల్లలకు కూటమి ప్రభుత్వం ఆసరాగా నిలుస్తుందని ఆశించారు. అధికారంలోకి వచ్చాకా ఆ తరహాలో పాలలేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సంపదను సృష్టించి సంక్షేమ పథకాలను అమలు చేస్తానన్న చంద్రబాబు అధికారాన్ని చేపట్టాకా ఆ స్పష్టతను ఇవ్వకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్ జగన్ పాలనలో అమ్మఒడి అమలు ఇలా..

మాజీ సీఎం వైఎస్ జగన్ తన హయాంలో విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ పాలన సాగించారు. చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. పిల్లలు ఉన్నతంగా ఎదగాలని ఆలోచన చేసి అమ్మ ఒడి పథకాలన్ని అమలు చేశారు. 2019లో ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020–21 విద్యా సంవత్సరం నుంచి పిల్లలను బడికి పంపిస్తున్న తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15 వేల చొప్పున జమ చేశారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ అమ్మఒడి సాయం క్రమం తప్పకుండా అందించారు. విద్యా పథకాల అమలుపై క్యాలెండర్‌ను విడుదల చేసి చెప్పింది చెప్పినట్టు సాయాన్ని అందజేశారు. చివరిసారిగా జగనన్న అమ్మఒడి నాలుగో సంవత్సరానికి సంబంధించిన సాయాన్ని 2023 జూన్ 28న పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 42,61,965 మంది విద్యార్థులకు రూ.6,392.94 కోట్ల విలువైన సాయమందించింది. జిల్లాలో 1,460 ప్రాథమిక, 84 ప్రాథమికోన్నత, 226 ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సక్రమంగా సకాలంలో సాయమందించింది. జిల్లాలో 1,38, 833 మంది తల్లుల ఖాతాల్లో రూ.13వేలు చొప్పున రూ.180,48,29,000 జమ చేశారు. అలాగే రూ.2వేలు చొప్పున రూ.27,76,66,000 డిస్ట్రిక్ట్ టాయిలెట్స్ మెయిన్‌టెన్స్ ఫండ్, డిస్ట్రిక్ట్ స్కూల్ మెయింటెనన్స్ ఫండ్ ఖాతాలోకి జమ చేశారు. మూడో విడతను 2022 జూన్ 27న శ్రీకాకుళం జిల్లాలో విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 43.96 మంది తల్లులకు రూ.6,594.6 కోట్లు సాయమందించారు. జిల్లాలో 1,45,642 మంది తల్లులకు రూ.218 కోట్ల సాయాన్ని చేశారు.

అప్పుడే మాట మార్చారు బాబూ..!

రామచంద్రపురం రూరల్: ఇంట్లో ఎంత మంది ఉన్నా అందరు పిల్లలకూ తల్లికి వందనం పేరుతో ఆర్థికసాయం అందిస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. తీరా అధికారం చేపట్టాక, ఒక్కో తల్లికి రూ.15 వేలు మాత్రమే ఇస్తామంటూ ప్రకటన చేశారు. ఈ మేరకు ఈ నెల 10న మార్గదర్శకాలు సైతం విడుదల చేశారు. ఎన్నికల ముందు చెప్పినట్టుగా తల్లికి వందనం హామీని కూటమి ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలని తల్లులు కోరుతున్నారు. ఆర్థిక కారణాలు చూపి పథకాన్ని నిర్వీర్యం చేస్తే సహించేది లేదంటున్నారు.

జగన్ పాలనలో అమ్మఒడి ఇలా..

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. 2019–20 విద్యా సంవత్సరం నుంచి క్రమం తప్పకుండా ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ అమ్మఒడి సాయం అందించారు. విద్యా పథకాల అమలుపై క్యాలెండర్‌ను విడుదల చేసి, చెప్పింది చెప్పినట్టుగా సాయాన్ని అందజేశారు.

మండపేట నియోజకవర్గంలో నాలుగో విడత 'అమ్మఒడి' అందుకున్న తల్లులు ఇలా...

మండలం	లబ్ధి అందుకున్న తల్లులు	పొందిన సాయం
మండపేట	11,200	రూ. 14,56,00,000
రాయవరం	4,796	రూ. 6,23,48,000
కపిలేశ్వరపురం	5,445	రూ. 7,07,85,000
మొత్తం	21,441	రూ. 27,87,33,000

చివరిసారిగా అమ్మఒడి నాలుగో ఏడాది సాయాన్ని 2023 జూన్ 28న పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని 8,544 మంది తల్లులకు రూ.11,10,72,000 అమ్మ ఒడి రూపంలో ఆర్థిక సాయం అందజేశారు.

గతంలో సమయానికి అందింది



గత ప్రభుత్వ హయాంలో నాలుగు విడతలుగా మా అమ్మాయికి అమ్మఒడి పథకం ద్వారా రూ.55,000 ఆర్థిక సాయమందింది. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో కూటమి మేనిఫెస్టోలో ఇంటిలో ఎంత మంది పిల్లలుంటే అంత మంది చదువుకూ ఆర్థిక సాయమందిస్తామని చెప్పారు. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ఒక్కో అమ్మాయికి రూ.15వేలు చొప్పున ఇద్దరికీ రూ.30 వేలు సాయమందుతుందని ఆశిస్తున్నాం. ఆ దిశగా సాయమందించాలని కోరుతున్నాం.

– అంసూరి లక్ష్మి స్రవంతి, కపిలేశ్వరపురం.

ఇద్దరు పిల్లలకు 'తల్లికి వందనం' సాయమందించాలి



మా పిల్లలు సూర్య రెండో తరగతి, చందు మూడో తరగతి గొల్లపుంత కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఇంటిలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి ఆర్థికసాయమందిస్తానని ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పారు. దాంతో ఇద్దరు పిల్లల చదువుల ఖర్చు ప్రభుత్వం భరిస్తుందన్న భరోసాతో ఉన్నాను. ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున సాయమందుతుందని ఆశిస్తున్నాను. సామాన్య కుటుంబానికి చెందిన వాళ్ళం కావడంతో ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇద్దరికీ తల్లికివందనం సాయమందించాలని కోరుకుంటున్నాను.

– శాకా దేవి, గొల్లపుంత కాలనీ, మండపేట

అందరికీ ఇవ్వాలి



నా ఇద్దరు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎంతమంది పిల్లలుంటే, అంతమందికీ తల్లికి వందనం ఇస్తానన్నారు. తీరా ఇప్పుడు ఒక్కరికే ఇస్తారంటూ ప్రచారం జరుగుతుంది. ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన మాట ప్రకారం అందరు పిల్లలకూ ఇవ్వాలి.

– టి.వీరలక్ష్మి, బందనపూడి. కాజులూరు మండలం

నెల అవుతున్నా ఇవ్వలేదు



నా ఇద్దరు పిల్లలు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. గతంలో పాఠశాలలు తెరచే సమయానికే అమ్మ ఒడి వచ్చేది. పాఠశాలలు తెరచి నెలపైన అవుతున్నా నగదు అందలేదు. ఫీజుల కోసం స్కూల్ యాజమాన్యం ఒత్తిడి చేస్తున్నారు. త్వరితగతిని తల్లికి వందనం సొమ్ములు ఇవ్వాలి.

– ఎస్ విజయ, గొల్లపాలెం. కాజులూరు మండలం

తట్టుకోలేకపోతున్నాం



ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం సొమ్ము అందిస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలిచాక ఇప్పుడు ఒక్కరికి మాత్రమేనని అంటున్నారు. నా ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాను. వారి చదువుకు అవసరమైన సొమ్ము వస్తుందని ఆశతో ఉన్నాం. ప్రభుత్వం మాట మార్చేందుకు యత్నించడాన్ని తట్టుకోలేకపోతున్నాం.

– తోకల మంగ, తామరపల్లి, కె.గంగవరం మండలం

రొయ్యల చెరువులకు అనుమతులు వద్దు



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కొత్తకోట వాసులు

కె.గంగవరం: తాగు, సాగు నీరు కలుషితం చేస్తున్న రొయ్యల చెరువులకు అనుమతులు ఇవ్వరాదని కొత్తకోట గ్రామ ప్రజలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో గతంలో తవ్విన చెరువుల్లో అక్రమంగా ఉప్పునీటితో రొయ్యల సాగు చేస్తున్నారని చెప్పారు. దీనిపై గ్రామ ప్రజలు హైకోర్టులో కేసు వేశామన్నారు.కేసు పెండింగ్‌లో ఉండగా, ఇదే చెరువులకు ఆనుకుని కొందరు తవ్వకాలకు సిద్ధమయ్యారని తెలిపారు. దీనివల్ల తాగునీటి జలాలు కలుషితమయ్యాయని, పంటలూ పండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ రవీంద్ర, ఎస్సై జానీబాషాకు వినతిపత్రాలు ఇచ్చారు. అమలాపురంలో కలెక్టర్‌కు, మత్స్య శాఖ అధికారులకూ వినతిపత్రాలు ఇచ్చినట్టు గ్రామస్తులు తెలిపారు.

జస్టిస్ స్వామి సేవలు అజరామరం

అయినవిల్లి: జస్టిస్ బీఎస్ఏ స్వామి సేవలు అజరామరమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ అన్నారు. గురువారం జస్టిస్ బీఎస్ఏ స్వామి జయంతిని ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం కళాశాలలో నిర్వహించారు. ఎమ్మెల్సీతో పాటు, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత స్వామి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని వీరు ప్రారంభించారు. కళాశాల రెసిడెన్షియల్ డైరెక్టర్ కుమారస్వామి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్ కాకర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు చిన్నాభిన్నం



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి నాగేశ్వరరావు నాయక్

రామచంద్రపురం: క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల వల్ల జరిగే రోడ్డు ప్రమాదాల్లో మరణాలు సంభవించే ప్రమాదం ఉందని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్ అన్నారు. మండల లోక్ అదాలత్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు డిగ్రీ కళాశాలలో హెల్మెట్ వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తే, వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని, ద్విచక్ర వాహన చోదకులను ప్రాణాపాయం నుంచి కాపాడే హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మైనర్లు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ కె.సత్యలత, వైస్ ప్రిన్సిపాల్ వై.పద్మజ, సీనియర్ న్యాయవాదులు ఆర్ఆర్‌కేబీ జానకి, లోక్ అదాలత్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతుల్లో పశుపోషణ

పశు గణాభివృద్ధి సంస్థ డీడీ అంబేడ్కర్



వెదురుమూడి పశు వైద్య శిబిరంలో పాడి పశువులను పరీక్షిస్తున్న వైద్యులు

కపిలేశ్వరపురం: పశుపోషణ శాస్త్రీయ పద్ధతుల్లో ఉండాలని పశు గణాభివృద్ధి సంస్థ కాకినాడ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. పశు సంవర్ధక శాఖ, జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వెదురుమూడిలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ ఆలమూరు ఏడీఏ ఎల్.అనిత పర్యవేక్షణలో ఉప సర్పంచ్ చంద్రు అచ్యుతరామయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ అంబేడ్కర్ మాట్లాడారు. పశువుల సంరక్షణలో ఆధునిక పద్ధతులను అవలంబించాలని, వాటికి సంబంధించిన అంశాలపై పాడి రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఉచిత పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. గ్రామానికి చెందిన 52 మంది పాడి రైతులు తమ 74 పశువులను శిబిరానికి తరలించారు. వైద్యులచే పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు, చూడు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కల్యాణి, డాక్టర్ రమణమూర్తి, మండల పశు ససంవర్థక సహాయకులు, బోనం నాని బాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అధిక జనాభాతో అనర్థాలు



గొల్లపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్లబ్ సభ్యులు, విద్యార్థులు



మాచవరం పీహెచ్‌సీ వద్ద నిర్వహిస్తున్న ర్యాలీ

రాయవరం: ప్రస్తుత పరిస్థితుల్లో అధిక జనాభాతో అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని మాచవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.శ్రీనివాస్, కె.మణికంఠలు పేర్కొన్నారు. మండలంలోని మాచవరం పీహెచ్‌సీ వద్ద గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనాభా వల్ల కలిగే అనర్థాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జనాభా పెరుగుదల నియంత్రణను సామాజిక బాధ్యతగా ప్రతి పౌరుడూ గుర్తించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ ఈహెచ్‌వో తులసీదాస్, ఎంపీహెచ్ఎస్ ఎ.గోపాల కృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్ శివప్రసాద్ పాల్గొన్నారు.

పరిమిత కుటుంబంతో ఆర్థిక పురోగతి

కాజులూరు: పరిమిత కుటుంబంతోనే ప్రతి ఒక్కరూ ఆర్థిక పురోగతి సాధిస్తారని, తద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గొల్లపాలెం లీలాకల్యాణి సాధన క్లబ్ సభ్యులు, కాకతీయ కళాశాల విద్యార్థులు సంయుక్తంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ వనుం శ్రీనివాస్, ప్రతినిధులు సలాది పుష్పవతి, ఈలి లక్ష్మి, కడలి రాంపండు, కళాశాల కరస్పాండెంట్ చెల్లిబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జీవ నియంత్రణ కేంద్రాలు

ఎంపీ హరీష్ మాథుర్

అంబాజీపేట: కొబ్బరి తోటలను ఆశించి అపార నష్టం కలిగిస్తున్న రూగోస్ వైట్ ఫ్లై (తెల్లదోమ) నివారణకు గ్రామీణ ప్రాంతాల్లో జీవ నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ అన్నారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ విలేకర్లతో మాట్లాడుతూ కోనసీమలో కొబ్బరిపై ఇరియోఫిడ్ మైట్ (ఎర్రనల్లి), తెల్లదోమల వల్ల దిగుబడులు తగ్గాయన్నారు. సిబ్బంది కొరత వల్ల పరిశోధన కేంద్రంలో బదనికలను ఆశించిన మేరకు ఉత్పత్తి చేయలేకపోతున్నట్టు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోనే జీవ నియంత్రణ బదనికలను ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. కొబ్బరి రైతులను ఆదుకోవడంలో భాగంగా ఉప ఉత్పత్తులు తయారు చేయాలన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం వచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. వివిధ రకాల పురుగులు, తెగుళ్లను తట్టుకునేలా నూతన హైబ్రీడ్ వంగడాలపై దృష్టి సారించాలని శాస్త్రవేత్తలను కోరారు. కోకో పంటకు కనీస మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. రైతులకు యంత్ర పరికరాలు రాయితీపై అందేలా కృషి చేస్తానన్నారు. కేంద్ర అధిపతి ఎన్‌బీవీ చలపతిరావు తమ కార్యకలాపాలను ఎంపీకి వివరించారు. సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, గణపతి వీరరాఘవులు, బొంతు పెద బాబు తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు తాత్కాలిక మరమ్మతులు

మలికిపురం: అధ్వాన స్థితిలో ఉన్న దిండి–చించినాడ బ్రిడ్జిని జాతీయ రహదారుల శాఖ అధికారులు గురువారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మానవతా మూర్తులు సామాజిక సేవా సంస్థ చేసిన ఆందోళన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. వంతెనకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ఆందోళనకారులు గురువారం కూడా ఆందోళన చేపట్టారు. అక్టోబర్‌లో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి, లైటింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

మనుషుల అక్రమ రవాణాను అరికడదాం

రాజానగరం: మనుషుల అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాపై గురువారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అక్రమ రవాణాకు గురయ్యే వారిలో అత్యధికులు అమ్మాయిలేనన్నారు. ఉద్యోగం, సినిమా అవకాశాలు తదితర వాటిని ఎరగా చూపి అమ్మాయిలను విదేశాలకు విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మహిళలు చైతన్యవంతురాలు కావాలన్నారు. సంస్థ కో ఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడుతూ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా తమ సంస్థ 28 ఏళ్లుగా పోరాటం చేస్తోందన్నారు. ఐసీడీఎస్, పోలీస్, విద్య న్యాయ శాఖల సహకారంతో ఇప్పటి వరకు 28,200 మంది మహిళలను కాపాడి, వారికి పునరావాసం కల్పించామన్నారు. ప్రతి గ్రామంలో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూపులను ఏర్పాటు చేయడం ద్వారా అందరు అప్రమత్తంగా ఉంటారన్నారు.

ఉత్తమ అర్చక పురస్కార ప్రదానం

అంబాజీపేట: శైవాగమ సంప్రదాయం ప్రకారం నూరు ప్రతిష్ఠలకు పైబడి నిర్వహించిన శైవాగమ సామ్రాట్ పుల్లేటికుర్తి సత్యనారాయణ శర్మ పూజ్యనీయుడని ఆదిశైవ అర్చక సంఘ మండల అధ్యక్షుడు కొత్తలంక విజయ భాస్కరుడు అన్నారు. మొసలపల్లిలో ఉన్న బాలాత్రిపుర సుందరీ సమేత భోగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణశర్మకు ఉత్తమ అర్చక పురస్కారాన్ని గురువారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శర్మ దంపతులను ఘనంగా సన్మానించారు.

అలరించిన శ్రీరామ నామ సప్తాహం



ఆలయం వద్ద భక్తి గీతాలు ఆలపిస్తున్న భజన బృందం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో భక్తిగీతాల కార్యక్రమం జరిగింది. ఏడో శ్రీరామనామ సప్తాహంలో భాగంగా రెండో రోజు గురువారం మేడిశెట్టి సత్యనారాయణ గురువు ఆధ్వర్యంలో గంగవరానికి చెందిన బృందావన విహారి మహిళా సమాజం, అంగర, వెంటూరుకు చెందిన వాసంశెట్టి సిస్టర్స్ మహిళా భజన బృందాలు భక్తి గీతాలను ఆలపించాయి.

స్వామి కల్యాణం.. వైభోగం

బిక్కవోలు: స్థానిక శ్రీగోలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువైన భద్రకాళీ సమేత వీర భద్రేశ్వరస్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి ఆషాఢ శుద్ధ పంచమి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు కల్యాణం నిర్వహించి స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలను తిలకించారు. బిక్కవోలులోని కుమార సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో స్వామివారిని గురువారం ప్రత్యేకంగా అలంకరించారు. స్కంద షష్ఠి సందర్భంగా అభిషేకాలు చేశారు. ఉదయం నుంచీ భక్తుల రద్దీ నెలకొంది.